
సాక్షి
కాకినాడ
ఆదివారం । 14 । జూలై । 2024



రూ.50,116 విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పోతంశెట్టి శివనాగరాజు దంపతులు (పశ్చిమ గోదావరి జిల్లా దువ్వ) శనివారం రూ.50,116 విరాళం అందించారు.



పంతం.. నీదా నాదా సై

కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ అలైన్‌మెంట్‌పై అమలాపురం ఎంపీ, ఎమ్మెల్యే మధ్య సయోధ్య లోపించింది. ఒకరు పాత దానికి, మరొకరు కొత్త ప్రతిపాదన చేయడం చర్చనీయాంశమైంది.

8లో



ప్రభుత్వంపై నిరసన జ్వాలలు

సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై నిరసన జ్వాలలు రేగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల ఆందోళనలు జరిగాయి.

న్యూస్‌రీల్

జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్

గుంటూరుకు సతీష్ కుమార్ బదిలీ



నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం/కాకినాడ రూరల్: జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పాటిల్ 2012 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. చిత్తూరు జిల్లా ఎస్పీగా పని చేసిన ఆయన విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్‌గా, విజయనగరం జిల్లా చింతలవలస ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా ఉన్న ఆయన తాజా బదిలీల నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో పాటు ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం అప్పగించింది. పాటిల్ సతీమణి దీపిక కూడా ఐపీఎస్ అధికారే. విజయనగరం జిల్లా ఎస్పీగా ఉన్న ఆమెను ప్రభుత్వం అనకాపల్లి ఎస్పీగా బదిలీ చేసింది. ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న ఎస్.సతీష్ కుమార్ గుంటూరు ఎస్పీగా బదిలీ అయ్యారు.

గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి జి.వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. బాలుర గురుకులంలో తెలుగు 4, హిందీ 1, ఇంగ్లిషు 4, మ్యాథ్స్ 5, కెమిస్ట్రీ 1, సివిక్స్, ఫిజిక్స్, ఫిజికల్ సైన్స్ ఒక్కో పోస్టుకు, సోషల్ 2 పోస్టులకు పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని వివరించారు. బాలికల గురుకులాల్లో హిందీ, కెమిస్ట్రీ, సివిక్స్, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, జువాలజీ, బోటనీ బోధించేందుకు ఒక్కో పోస్టుకు, మ్యాథ్స్ 3, సోషల్ 2, ఫిజిక్స్ 3 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన దరఖాస్తులు కోరుతున్నట్లు వెంకటరావు తెలిపారు. గతంలో గురుకులాల్లో పని చేసిన వారికి సంవత్సరానికి ఒక మార్కు, గరిష్టంగా 5 మార్కులు పరిగణిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ధ్రువపత్రాల నకళ్లను 'జిల్లా కో ఆర్డినేటర్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ, కలెక్టరేట్ కాంపౌండ్, అప్‌స్టెయిర్స్ వికాస ఆఫీస్, కాకినాడ' చిరునామాలో ఈ నెల 18లోగా సమర్పించాలన్నారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఫస్ట్ క్లాస్‌తో పాటు బీఎడ్, టెట్ అర్హత పొంది ఉండాలని తెలిపారు.

హేచరీ రంగంలో నూతన పద్ధతులు పాటించాలి



ఆక్వా రైతుల సదస్సును ప్రారంభిస్తున్న సత్యనారాయణ తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): హేచరీ రంగంలో వస్తున్న నూతన పద్ధతులను పాటించాలని ఆలిండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్కరాజు సత్యనారాయణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం ఆక్వా రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హేచరీ రైతులకు వాటర్ ఫిల్టరేషన్, బ్రూడ్ స్టాక్ మేనేజ్‌మెంట్, లార్వా డొమైన్లో నార్వేజియన్ ఆక్వా కల్చర్ ఫిషరీస్‌లో అధునాతన సాంకేతిక పరికరాల ప్రదర్శనను రెడాక్స్ జోన్ ఆక్వా ఇండియా ఆధ్వర్యాన నిర్వహించారు. రెడాక్స్ తయారు చేసిన ఆక్సిజన్ జనరేటర్, ఆక్సిజన్ డిఫ్యూజర్ పనితీరును ఆ సంస్థ డైరెక్టర్ అరిందమ్ పత్రాషి వివరించారు. కార్యక్రమంలో ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీకి పెరిగిన వరద నీటి ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం రాత్రి 99,368 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. వరద ఉధృతి స్వల్పంగా పెరగడంతో మిగులు జలాల విడుదలను పెంచారు. బ్యారేజీలోని ధవళేశ్వరం, మద్దూరు, ర్యాలీ, విజ్జేశ్వరం ఆర్మ్‌లలో మొత్తం 175 గేట్లకు గాను 159 గేట్లను పైకి లేపి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరిలో మరో మూడు రోజుల పాటు వరద ఉధృతి ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఖరీఫ్ సాగు కోసం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

అప్పుల తిప్పలు

- బీసీ, ఎస్సీ హాస్టళ్లకు డైట్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం
- రూ.10 కోట్ల పైనే బకాయిలు
- అవి చెల్లించకుండా సరుకులు ఇవ్వలేమంటున్న కిరాణా వ్యాపారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- బడ్జెట్ విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్



శంఖవరం మండలం పెద్ద మల్లాపురం గిరిజన సంక్షేమ హాస్టల్‌లో భోజనాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పేద విద్యార్థులకు పౌష్టికాహారం, వసతి ఇస్తూ.. వారి చదువులకు తోడ్పడే బీసీ, ఎస్సీ వసతి గృహాలకూ (హాస్టళ్లు) అప్పుల తిప్పలు తప్పడం లేదు. వాటిల్లోని విద్యార్థులకు కడుపు నిండా అన్నం పెట్టాలంటే వార్డెన్లు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిర్వాకంతో ఈ పరిస్థితి నెలకొంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని నెలలుగా హాస్టళ్లలోని విద్యార్థుల కోసం చెల్లించాల్సిన డైట్ చార్జీలు విడుదల చేయలేదు. ఎన్నికలు అయిపోయాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి అప్పుడే నెల రోజులు గడచింది. డైట్ చార్జీలు రేపు, మాపు విడుదలవుతాయంటూ సంబంధిత అధికారులు చెబుతూ వస్తున్నారు. కానీ, ఇప్పటి వరకూ విడుదల కకపోవడంతో వార్డెన్లు నానా ఇబ్బందులూ ఎదుర్కొంటున్నారు.

ఎన్నికల కోడ్‌తో బ్రేక్

ఉమ్మడి జిల్లాలోని 93 ఎస్సీ, 118 బీసీ హాస్టళ్లలో సుమారు 17,000 మంది విద్యార్థులుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వీరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా డైట్ చార్జీలు విడుదల చేసి ఇబ్బందులు లేకుండా చూసిందని విద్యార్థులు చెబుతున్నారు. గత మార్చి నెలలో డైట్ చార్జీలు విడుదల చేసే తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులోకి రావడంతో డైట్ చార్జీల విడుదలకు బ్రేక్ పడింది. అప్పటి నుంచి జూన్ 4న ఫలితాలు వెలువడేంత వరకూ డైట్ చార్జీల అంశం మరుగున పడిపోయింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో హాస్టళ్ల వివరాలు

ఎస్సీ హాస్టళ్లు	:	93
విద్యార్థులు	:	సుమారు 9,000
బీసీ హాస్టళ్లు	:	118
విద్యార్థులు	:	సుమారు 8,000

ప్రతి నెలా ఒక్కో హాస్టల్ విద్యార్థికి ప్రభుత్వం డైట్ చార్జీలు చెల్లిస్తుందిలా..

3, 4 తరగతులు	:	రూ.1,150
5 – 10 తరగతులు	:	రూ.1,400
ఇంటర్మీడియెట్, ఆపై..	:	రూ.1,600

వీటికి అదనంగా కాస్మెటిక్ చార్జీలు కూడా విడుదల చేస్తారు.

కొత్త ప్రభుత్వం కొలువుదీరినా..

వంద మంది విద్యార్థులున్న హాస్టల్ నిర్వహించాలంటే ప్రతి నెలా తక్కువలో తక్కువ రూ.లక్ష దాటేస్తోందని వార్డెన్లు చెబుతున్నారు. సాధారణంగా వారు ప్రతి నెలా కిరాణా దుకాణాల నుంచి నెలకు సరిపడా కిరాణా సామాన్లు తీసుకుని వస్తుంటారు. ప్రభుత్వం డైట్ చార్జీలు విడుదల చేయగానే ఒక నెల అటూ ఇటుగా డబ్బులు చెల్లించేసేవారు. డబ్బులకు గ్యారంటీ ఉండటంతో కిరాణా దుకాణాల యజమానులు కూడా ఇబ్బంది పెట్టకుండా సరకులు ఇచ్చేవారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటిపోయినా ఇంతవరకూ డైట్ చార్జీలు చిల్లి గవ్వ కూడా విడుదల చేయలేదు. మూడు నెలలుగా డైట్ బడ్జెట్ విడుదల కాక, బకాయిలు భారీగా పేరుకుపోవడంతో ఇక అరువుపై కిరాణా సామాన్లు ఇవ్వలేమని కిరాణా దుకాణాల యజమానులు ముఖం మీదే చెప్పేస్తున్నారు. కొందరు వ్యాపారులైతే బకాయిలపై వడ్డీలు కూడా వేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం వార్డెన్లకు తలపోటుగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచీ ఈ బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఒక్కో హాస్టల్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ డైట్ చార్జీలు రావాల్సి ఉంది. విద్యార్థులను పస్తులుంచలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో కొంత మంది హాస్టల్ వార్డెన్లు అక్కడక్కడ అప్పులు చేసి సర్దుబాటు చేస్తున్నారు. ఏదో ఒక నెల అంటే దుకాణాల యజమానులను బతిమాలుకుని కిరాణా సరకులు తెస్తున్నామని, నెలల తరబడి ఇలా చేయడం సాధ్యం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే విడుదల చేయాలి

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ హాస్టళ్లకు సంబంధించి పెండింగ్, తాజాగా ఇవ్వాల్సిన డైట్ చార్జీలు అన్నీ కలిపి సుమారు రూ.7.50 కోట్లు రావాల్సి ఉంది. బీసీ హాస్టళ్లకు కూడా సుమారు ఐదారు కోట్ల రూపాయలు విడుదల కావాల్సి ఉందని సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నారు. దీనికి కాస్మెటిక్ చార్జీలు అదనమని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డైట్ చార్జీలు విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమించక తప్పదని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

నాణ్యమైన భోజనం ఎలా పెట్టగలరు?



ఎస్సీ, బీసీ వసతి గృహాలకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్ పెడితే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా పెట్టగలరు? ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలి. హాస్టల్‌లో ట్యూటర్లు లేని కారణంగా 10వ తరగతి విద్యార్థులు సైతం రాత్రి వేళల్లో బయటకు ట్యూషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. హాస్టళ్లలో శాశ్వత ట్యూటర్లను ఏర్పాటు చేయాలి.

– లలిత్ కుమార్, విద్యార్థి పరిషత్ స్టేట్ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) కో కన్వీనర్, కాకినాడ

తక్షణమే విడుదల చేయాలి



బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు వెంటనే విడుదల చేయాలి. వార్డెన్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కారణంగా పెండింగ్ డైట్ చార్జీల విడుదలలో కొంత జాప్యం జరిగింది. ఇప్పటికైనా పాత బకాయిలతో పాటు తాజా బడ్జెట్ కూడా విడుదల చేసి ఇబ్బందులు తొలగించాలి.

– రేవు తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీడీఎస్‌యూ, అమలాపురం

ప్రభుత్వం చొరవ చూపాలి



బడ్జెట్ విడుదలలో జాప్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. అక్కడక్కడ అప్పులు చేసి హాస్టళ్లలోని విద్యార్థులకు సరిపడా కిరాణా సరకులు తీసుకు వస్తున్నారు. బకాయిలు వెంటనే విడుదల చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మెటిక్ చార్జీలు కూడా పెంచాలి.

– కారెం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్, కోనసీమ జిల్లా

విద్యార్థులకు ఇబ్బందులు



పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉండే సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెస్ చార్జీలు చెల్లించకపోతే హాస్టళ్లలో విద్యార్థులు ఏవిధంగా గడపగలరు? హాస్టల్ వార్డెన్లు కూరగాయలు, కిరాణా సరకులు ఏవిధంగా తీసుకుని వచ్చి నాణ్యమైన ఆహారం పెట్టగలరు? ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలి.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

విడుదల చేయకుంటే ఆందోళనే..



ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలి. లేకుంటే ఆందోళన తప్పదు. ప్రభుత్వం ఒక పూటకు రూ.15 మాత్రమే ఇస్తోంది. ఈ సొమ్ముతో పౌష్టికాహారం ఎలా అందుతుంది? జైలులోని ఖైదీలకన్నా విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలు తక్కువగా ఇస్తోంది.

– ఎస్.కిరణ్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజమహేంద్రవరం

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతిలో స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం పోటెత్తారు. స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు సుగంధ పరిమళాలు వెదజల్లే పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.3,46,171 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ప్రసాద వితరణ చేశారు. సుమారు 6 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

పిల్లలకు, తల్లులకు పంగనామం

- 'తల్లికి వందనం' పేరుతో ప్రభుత్వం దగా
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు



మాజీ మంత్రి కురసాల కన్నబాబు

జగనన్న అమ్మ ఒడి పథకం కింద 2019–20 విద్యా సంవత్సరంలో 81,72,244 మంది విద్యార్థుల కోసం 42,33,088 మంది తల్లుల ఖాతాల్లో నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.6,349.6 కోట్లు జమ చేసింది. 2020–21లో 83,76,020 మంది విద్యార్థులకు సంబంధించి 44,48,865 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,673.4 కోట్లు వేసింది. 2021–22లో 82,06,302 విద్యార్థుల కోసం 42,62,419 తల్లుల ఖాతాల్లో రూ.6,393.6 కోట్లు జమ చేసింది. 2022–23లో 83,15,341 మంది విద్యార్థులకు 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జగన్ జమ చేశారు. ఇలా నాలుగేళ్లలో నాలుగు విడతల్లో అమ్మ ఒడి ద్వారా విద్యార్థుల తల్లులకు జగన్ ప్రభుత్వం అక్షరాలా రూ.26,067.30 కోట్లు అందించింది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 43 లక్షల మంది తల్లుల ఖాతాల్లో గత వేసవి సెలవుల తరువాత రూ.15 వేల చొప్పున మరో రూ.6,400 కోట్లు జమ చేయడానికి జగన్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'తల్లికి వందనం' పేరుతో కూటమి ప్రభుత్వం పిల్లలను, తల్లులను పచ్చిగా మోసం చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు విమర్శించారు. కాకినాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రచారం చేసిన కూటమి.. నేడు అధికారంలోకి వచ్చాక దగా చేస్తోందని దుయ్యబట్టారు. 'అది తల్లికి వందనం కాదు. పిల్లలు, తల్లులకు పంగనామం పెట్టే పథకం' అని విమర్శించారు. ఇంట్లో ఒక్కో పిల్లాడిని చూపిస్తూ.. 'నీకు 15, నీకు 15, నీకు 15.. మా ప్రభుత్వం రాగానే రూ.45 వేలు, రూ.60 వేలు, రూ.75 వేలు ఇస్తాం' అంటూ చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం తల్లికి వందనం పథకంపై ఆర్భాటంగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు గొప్పగా చెప్పుకొన్న సూపర్ సిక్స్‌లో కూడా ఈ పథకాన్ని చూపారని, నేడు ఆ సూపర్ సిక్స్‌నే ప్రస్తావించడం లేదని అన్నారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జారీ చేసిన జీఓ–29లో ప్రతి విద్యార్థికి అని కాకుండా, ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామంటూ ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అసలు ఈ పథకాన్ని ఎలా అమలు చేయాలనుకుంటున్నారో సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ ఎన్నిసార్లు ప్రశ్నించినా ఎవ్వరూ నోరు మెదపడం లేదని అన్నారు. చివరకు విద్యా శాఖ నుంచి ఒక నోట్ విడుదల చేశారని, పథకంలో ఆధార్ లింక్ కోసమే ఈ జీఓ ఇచ్చామంటూ చెప్పుకు రావడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతి పథకాన్నీ ఆధార్‌తో అనుసంధానం చేస్తూ, అర్హులైన ఏ ఒక్కరికీ లబ్ధి చేకూరలేదనే మాట లేకుండా అన్నింటినీ గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసి చూపిందని గుర్తు చేశారు. అటువంటిది ఇప్పుడు విచిత్రంగా తల్లికి వందనం పథకంలో లబ్ధికి ఆధార్‌తో లింక్ కోసమే జీఓ ఇచ్చామని చెప్పడం జోక్ అని కన్నబాబు ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకం కాపీనే ఈ 'తల్లికి వందనం' అని అన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ మేరకు ప్రతి విద్యార్థికీ ఈ పథకాన్ని పక్కాగా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదే జగన్ సీఎంగా ఉండి ఉంటే ఈపాటికే 'అమ్మ ఒడి' డబ్బులు వచ్చి ఉండేవి కదా అని అన్నారు. నయవంచనకు మారుపేరు చంద్రబాబు అని మళ్లీ రుజువైందన్నారు.

సుప్రీం తప్పు పట్టినా జగన్‌పై అక్రమ కేసు

అప్పటి ఎంపీ రఘురామ కృష్ణరాజు ఫిర్యాదులో వాస్తవం లేదని సాక్షాత్తూ సుప్రీంకోర్టే నాడు స్పష్టం చేసినా.. మూడేళ్ల తర్వాత నేడు చంద్రబాబు ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్‌లు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్‌పై నిస్సిగ్గుగా కేసు నమోదు చేసిందని కన్నబాబు దుయ్యబట్టారు. ఎవరి సంతోషం కోసమో, ఎవరిని ఇబ్బంది పెట్టడం కోసమో అన్నట్లు కేవలం దురుద్దేశం, రాజకీయ కక్షతోనే ఈ కేసు నమోదు చేశారని అన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో పోలీసులు కొత్త సంప్రదాయానికి తెర తీశారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ కేసులో జగన్‌ను ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. రఘురామ కృష్ణరాజు గత నెల 11న ఈ–మెయిల్ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే.. అంతకు ఒక రోజు ముందే అంటే జూన్ 10న పోలీసులు న్యాయ సలహా తీసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అంటే రఘురామ ఫిర్యాదు చేస్తారని పోలీసులు ముందుగానే కల గన్నారా? ఫిర్యాదు రాక ముందే న్యాయసలహాకు ఎలా రాశారో చెప్పగలరా అని కన్నబాబు ప్రశ్నించారు.

రత్నగిరిపై వానాయాతన

- వర్షంలో తడవకుండా కానరాని ఏర్పాట్లు
- లిఫ్ట్ వద్ద షెడ్డుకు రంధ్రాలు
- ఉపయోగపడని గ్రీన్ షేడ్ నెట్
- ఆలయం ప్రాంగణంలో తడిసి ముద్దయిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



తూర్పు రాజగోపురం ముందు వర్షంలో తడుస్తున్న భక్తులు



గ్రీన్ షేడ్ నెట్‌లో గొడుగు వేసుకుని వెళ్తున్న భక్తులు



లిఫ్ట్ నుంచి ప్రధానాలయానికి వెళ్లే దారిలో వర్షానికి తడిసిన దారి

అన్నవరం: ఎడతెరిపి లేకుండా రోజంతా కురిసిన వర్షంతో రత్నగిరిపై భక్తులు శనివారం నానా యాతనలూ పడ్డారు. వర్షంలో తడవకుండా సరైన ఏర్పాట్లు లేకపోవడంతో తడిసి ముద్దయ్యారు. ప్రధానంగా పశ్చిమ రాజగోపురం నుంచి ఆలయ ప్రాంగణంలోకి వచ్చిన భక్తులు వర్షంలో తడవకుండా ఉండేందుకు ఎక్కడా షెల్టర్ లేదు. ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రీన్ షేడ్ నెట్ ఉన్నప్పటికీ అది ఎండల నుంచి మాత్రమే రక్షణ ఇస్తుంది. వర్షాకాలం వచ్చిందంటే దానికి ఉన్న సూక్ష్మ రంధ్రాల ద్వారా వాన నీరు కారిపోయి, భక్తులు తడిసిపోతూంటారు. శనివారం భక్తులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. మరోవైపు వృద్ధులు, దివ్యాంగుల కోసం సత్యదేవుని ఆలయం వద్ద నిర్మించిన లిఫ్ట్ వరకూ వెళ్లాలన్నా కూడా తడవక తప్పని పరిస్థితి. లిఫ్ట్‌లో పైభాగానికి చేరుకున్నాక.. అక్కడి నుంచి ఆలయం వరకూ రేకుల షెడ్డు ఉంది. కానీ ఆ షెడ్డుకు మధ్యలో రంధ్రాలు ఉండటంతో వాన నీరు కారిపోతోంది. దీంతో నేలంతా తడిసిపోయి, వృద్ధులు, దివ్యాంగులు జారి పడిపోయే పరిస్థితి తలెత్తుతోంది.

విశ్రాంతి షెడ్డు లేక..

పశ్చిమ రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి గత ఏడాది లారెల్స్ ఫార్మాస్యూటికల్ ల్యాబ్ ముందుకు వచ్చింది. రూ.2 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించడానికి వీలుగా అక్కడ ఉన్న 60 గదుల సత్రాన్ని కూల్చేశారు. ఇది జరిగి దాదాపు పది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ అక్కడ విశ్రాంతి షెడ్డు నిర్మాణం జరగలేదు. దేవస్థానం బస్సులు భక్తులతో అక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ఎండాకాలంలో అక్కడ షామియానాలు వేస్తున్నారు. వర్షాకాలంలో షామియానాలు ఉన్నప్పటికీ భక్తులు తడవక తప్పడం లేదు. శనివారం కూడా పలువురు భక్తులు అదేవిధంగా తడిసిపోయారు. నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠా పూజల కోసం ఆలయం ముందు ఏప్రిల్‌లో వేసిన తాటాకుల పాకలో కొంతమంది భక్తులు తలదాచుకున్నారు. పశ్చిమ రాజగోపురం ముందు విశ్రాంతి షెడ్డు నిర్మాణంతో పాటు ఆలయ ప్రాకారంలో కూడా గ్రీన్ షేడ్‌కు బదులు ఎండ, వానల నుంచి రక్షణనిచ్చేలా షెడ్లు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది

సుమారు 25 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఉదయం నుంచీ వర్షం కురుస్తున్నప్పటికీ పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. దీంతో సత్యదేవుని ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని అన్నప్రసాదాన్ని సుమారు 3 వేల మంది భక్తులు స్వీకరించారు. వర్షం కారణంగా సత్యదేవుని ప్రాకార సేవ ఆలయం లోపలి ప్రాకారంలో నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని పండితులు పల్లకీలోకి వేంచేయించి, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ప్రదక్షిణగా ఊరేగించారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో లారీని పట్టుకున్న అధికారులు

పిఠాపురం: విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు గొల్లప్రోలు శివారులో కాకినాడ నుంచి కత్తిపూడి వైపు 216 జాతీయ రహదారిలో వెళ్తున్న లారీని ఆపి విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారుల బృందం తనిఖీలు చేసింది. ఆ లారీలో 458 బస్తాల్లో సుమారు 22,900 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. దీనిని గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన ఉమ్మిడి కృష్ణకిరణ్ లారీలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ ప్రాంతానికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.20.41 లక్షలు ఉంటుంది. నిందితులపై క్రిమినల్ కేసుల నమోదుకు పోలీస్ స్టేషన్‌కు సిఫారసు చేసినట్లు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో చౌక బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, భార్గవ్ మహేష్, వీరబాబు, సీఎస్‌డీటీ కృష్ణ పాల్గొన్నారు.

బంగారం, వెండి ఆభరణాల చోరీ

పెదపూడి: రామేశ్వరంలో చోరీ జరిగిందని ఎస్సై శోభన్‌కుమార్ శనివారం తెలిపారు. గ్రామంలో కోలా సూర్యసత్యనారాయణ, అతని కొడుకు ఏసుబాబు పక్కపక్కన ఇళ్లలో ఉంటున్నారు. నాలుగు రోజుల కిందట ఏసుబాబు తీర్థయాత్రలకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఏసుబాబు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని తండ్రి సత్యనారాయణ చూశాడు. వెంటనే ఇంటి లోపలకు వెళ్లగా బీరువాలోని 8 కాసుల బంగారం, 7 తులాల వెండి ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

పంతం.. నీదా నాదా

- ట్రాక్ తప్పుతున్న రైల్వే లైన్ అలైన్‌మెంట్
- అమలాపురం ఎంపీ, ఎమ్మెల్యేల చెరోమాట
- పాత దానికి ఎంపీ, కొత్త ప్రతిపాదనతో ఎమ్మెల్యే
- ఈ మార్పు అనివార్యమైతే మరికొంత ఆలస్యం


అమలాపురం టౌన్: సొంత పార్టీలోనే కుంపటి రాజుకుంది.. ఒకరికొకరు పంతానికి పోవడంతో చివరికి చేటు తెచ్చేలా మారింది.. రైల్వే లైన్ పనులు ట్రాక్ తప్పేట్టు కనిపిస్తోంది.. ఇద్దరూ ఒక పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులైనా ఎవరి మాట వారిదే కావడంతో కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌కు గ్రహణం పట్టనుంది. ఇప్పటికే ఆలస్యమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం వీరి వాదనల మధ్య ఎక్కడికి వెళ్తుందోనన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

కోనసీమ మీదుగా కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌కు సంబంధించి మూడు నదులపై వంతెనల నిర్మాణ పనులు ఒకపక్క సాగుతున్నాయి. మరోపక్క ఈ లైన్ అలైన్‌మెంట్‌పై కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎంపీ గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుల మధ్య ఏకాభిప్రాయం కొరవడింది. ముఖ్యంగా



కోటిపల్లి- శానపల్లిలంక మధ్య గౌతమీ నదిపై రైల్వే వంతెన పనులు

కోనసీమ రైల్వే ప్రాజెక్ట్‌కు 24 ఏళ్ల కిందట రైల్వే శాఖ సూచించిన లైన్ (ట్రాక్) అలైన్‌మెంట్‌కు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లకు రూపకల్పన జరిగింది. 2000వ సంవత్సరం నవంబర్ 16న అమలాపురంలో ఈ రైల్వే లైన్‌కు పునాది పడింది. నాటి నుంచి 24 ఏళ్లుగా మారుతున్న ప్రభుత్వాలు, ఇక్కడ ఎన్నికవుతున్న ఎంపీలు లైన్ నిర్మాణానికి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తూనే ఉన్నారు. నేటి వరకూ నాడు రూపొందించిన లైన్ అలైన్‌మెంట్ అంటే, అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి నుంచి కామనగరువు, పేరూరు మీదుగా వైనతేయ నదిపై బోడసకుర్రు– పాశర్లపూడి రైల్వే వంతెన మీదుగా సాగేలా పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు ఎంపీ హరీష్‌తోపాటు రైల్వే అధికారులు కూడా పాత డీపీఆర్‌ల ప్రకారమే పనులు జరుగుతాయని ఆ దిశగానే భూసేకరణ జరుగనుందని అంటున్నారు. అయితే ఎమ్మెల్యే ఆనందరావు సెంటిమెంట్‌తో పాటు కొందరి రైతుల ఒత్తిడి కారణంగా ఈ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలన్న ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. పట్టణానికి తూర్పు వైపు



కోనసీమ రైల్వే ట్రాక్, వంతెనల అలైన్‌మెంట్ గ్రాఫ్

నుంచి ఉన్న పాత అలైన్‌మెంట్ వల్ల సెంటిమెంట్‌గా పట్టణ, పరిసర గ్రామాల అభివృద్ధి దెబ్బతింటుందన్నది ఎమ్మెల్యే అభిప్రాయం. పై పెచ్చు పంట పొలాల్లోంచి రైల్వే లైన్ వెళితే ఆ భూములకు అంత విలువ కూడా పలకదన్నది కొందరి రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వాదన. వీరంతా ఎమ్మెల్యేను ఆశ్రయించడంతో ఆయన అలైన్‌మెంట్ మార్పు చేయాలన్న ప్రతిపాదన తెచ్చారని సమాచారం. అయితే ఇది ఆచరణలో సాధ్యం కాదన్న అభిప్రాయం రైల్వే అధికారులతో పాటు ఎంపీ, మేధావుల నుంచి వ్యక్తమవుతోంది. ఇప్పటికే 24 ఏళ్ల ఆలస్యంతో నత్తనడకన నడుస్తున్న రైల్వే పనులు ఇప్పుడు అలైన్‌మెంట్ మార్పు అంటే మరో పదేళ్ల వెనక్కి వెళ్లినట్లు అవుతుందన్నది ఎంపీ, రైల్వే అధికారులు, మేధావులు చెబుతున్న బలమైన అభిప్రాయం.

ఎమ్మెల్యే ప్రతిపాదన ఇదీ

గౌతమీ నదీ పాయపై కోటిపల్లి– శానపల్లిలంక వద్ద నిర్మిస్తున్న రైల్వే వంతెన నుంచి ట్రాక్ అయినవిల్లి మండలం మాగం మీదుగా అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని ప్రతిపాదించిన రైల్వే స్టేషన్ వరకూ నిర్మాణం కానుంది. శానపల్లిలంక– భట్నవిల్లి మధ్య ట్రాక్ కోసం దాదాపు 81 ఎకరాల భూసేకరణ కూడా జరిగింది. ఇక భట్నవిల్లి నుంచి కామనగరువు, పేరూరు, బోడసకుర్రు గ్రామాల్లో భూసేకరణ జరగాల్సి ఉంది. పాత అలైన్‌మెంట్ ఇలా ఉండగా ఎమ్మెల్యే ఆనందరావు అమలాపురం రూరల్ మండలం వేమవరం నుంచి నడిపూడి, బండార్లంక ఎస్ కౌంటర్ వంతెన నుంచి ఇందుపల్లి మీదుగా బోడసకుర్రు– పాశర్లపూడి మధ్య నిర్మితమవుతున్న రైల్వే వంతెనకు ప్రతిపాదించారు. ఆ దిశగా కొత్త డీపీఆర్ చేయించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం పొందాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. పాత అలైన్‌మెంట్‌లో రెండు నేషనల్ హైవేలను ట్రాక్‌ను దాటించాల్సిన పరిస్థితి ఉంటే.. తాను చేసిన ప్రతిపాదనలో ఒకే ఒక స్టేట్ హైవే దాటే అవకాశం ఉంటుందన్నది ఎమ్మెల్యే వాదన. ఏదేమైనప్పటికీ పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రాక్ నిర్మితమవుతుందని రైల్వే అధికారులు, ఎంపీ అంటుంటే, ఎమ్మెల్యే మాత్రం కొత్త ప్రతిపాదనతో ముందుకు రావడంపై కోనసీమ ప్రజల్లో ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య దీనిపై ఏకాభిప్రాయం లేదన్న చర్చ జరుగుతోంది. ఇద్దరు ప్రజాప్రతినిధులు చెరోమాట మాట్లాడుతూండడంపై అసలు అలైన్‌మెంట్ ఎటు వెళుతుందన్న గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

బిడ్డను చూసి వస్తుండగా..

- ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం
- అనంతపల్లి వద్ద సంఘటన

నల్లజర్ల: పుట్టిన బిడ్డను చూసిన ఆనందం.. ఆపై కుటుంబ సభ్యులను కలసి వస్తుండగా ఓ వ్యక్తి అనుకోని ప్రమాదంలో అశువులు బాసాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా జాండ్రపేటకు చెందిన కుంభం సంతోష్ కుమార్ (31) చీరాల ఓడలరేవు వద్ద ఉన్న రిసార్ట్స్‌లో పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట శ్రీకాకుళంలోని తన భార్య భువనేశ్వరి, మూడు నెలల పాపను చూడటానికి బైక్‌పై వెళ్లారు. ఆ మధుర క్షణాలను నెమరవేసుకుని తిరిగి ఇంటికి బయలు దేరాడు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నల్లజర్ల మండలం అనంతపల్లి శివారు హైస్కూల్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా చిప్స్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంతోష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలిస్తున్న స్థానికులు

WE ARE HIRING

KIMS HOSPITALS

FOOD & BEVERAGE DEPARTMENT:
Positions - 5
Tea Master: 1, Helpers: 4
Qualification: Non Metric,
Experience: 0-2 years

HOUSE KEEPING DEPARTMENT:
Positions-10 Ayas / Ward boys
Qualification: SSC / Non Metric, Experience: 0-2 years

SECURITY DEPARTMENT:
Positions- 5; Security Guards,
Qualification: SSC, Experience: 0 - 2 years.

For More Information, Contact:
rjy.hr@kimshospitals.com
+91 8179256777

Walk-ins Address: KIMS Hospitals,
Seelam Nookaraju Complex Rd,
Katari Gardens, Gandhipuram, Rajamahendravaram.

ప్రభుత్వంపై నిరసన జ్వాలలు

- జీపీఎస్ అమలుకు గెజిట్ నోటిఫికేషన్‌పై ఆగ్రహం
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు
- జీఓ ప్రతుల దహనం



కచేరీపేటలో జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులు దహనం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై నిరసన జ్వాలలు రేగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల ఆందోళనలు జరిగాయి. అమలాపురంలో కోనసీమ జిల్లా యూటీఎఫ్ ప్రతినిధులు శనివారం సాయంత్రం నిరసన తెలిపారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో నోటిఫికేషన్ విడుదలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీపీఎస్‌కు చెందిన గెజిట్ కాపీలను, జీఓ పత్రాలను మంటల్లో వేసి దహనం చేశారు. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తుంటే, దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు బ్యాక్ డేట్‌తో జీపీఎస్‌ను అమలు చేస్తూ రాజపత్రం విడుదల చేయడం దారుణమని జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎంటీవీఎస్ సుబ్బారావు ధ్వజమెత్తారు. దానిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణమే అమలు చేసి 2023 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బేతినీడి శ్రీనివాసరావు, కోశాధికారి కేశవరావు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, పి.మురుగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో..

కాకినాడ సిటీ: జీపీఎస్ అమలుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలను వ్యతిరేకిస్తూ కాకినాడ కచేరీపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా యూటీఎఫ్ శాఖ నాయకులు ఆందోళన చేశారు. ఈ మేరకు ఆ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. జీపీఎస్ విధానంపై ఉద్యోగ ఉపాధ్యాయులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని తీసుకు వస్తామని కూటమి పెద్దలు చెప్పి, ఇప్పుడు ఏకపక్షంగా గెజిట్‌ను విడుదల చేయడాన్ని వారు ఖండించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే ప్రభుత్వంపై పోరాటం చేయాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండానే గెజిట్ విడుదల చేయడం అత్యంత దుర్మార్గమని, వెంటనే ఉద్యోగ సంఘాలతో చర్చించి జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సామర్లకోట మండల శాఖ అధ్యక్షురాలు ఎంబీఎస్ దేవి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన విధానం తీసుకు వస్తామని పలు సందర్భాల్లో చెప్పారని అన్నారు. కానీ ప్రభుత్వం జీపీఎస్ అమలుకు ఏకపక్షంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ సాయిరాం, సహాధ్యక్షుడు వీవీ రమణ, జిల్లా మహిళా సహాధ్యక్షులు బి.నాగమణి, జిల్లా కార్యదర్శులు టి.సీతారామయ్య, కె.పెద్దిరాజు, సభ్యులు పి.రాజబాబు, శీలం శ్రీనివాస్, వి.ఉమామహేశ్వరరావు, ఈశ్వరరావు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కంబాలచెరువు జంక్షన్ వద్ద ఆ జీఓ ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీపీఎస్ అమలుకు ప్రయత్నించిందని, పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా జీఓను విడుదల చేయలేదన్నారు. ఇప్పుడు పాత తేదీతో జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. ఇది పూర్తిగా ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. జిల్లా సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరీ, కోశాధికారి ఈపీఎస్ఆర్ ప్రసాద్, ఎం.రవిబాబు, డీఎస్ ప్రకాశరావు, ఇ.శ్రీమణి, ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

వెంకటా చలపతే.. నమోస్తుతే



వాడపల్లి ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం

- వాడపల్లికి ఆధ్యాత్మిక శోభ
- ఒక్కరోజే రూ.39.61 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: శ్రీపద్మనాభ.. దేవదేవ వాసుదేవ నమోస్తుతే నామస్మరణ భక్తుల నోట వేదమంత్రమైంది. వాడపల్లి వాడవాడలా శ్రీనివాసుని స్మరణ మార్మోగింది. దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతున్న ఈ క్షేత్రం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వానలోనూ ఆధ్యాత్మిక పరిమళాలు విరజిమ్మింది. కోనసీమ తిరుపతి, వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయం కిక్కిరిసింది. ఉదయమే స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు తొలుత గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శనానికి క్యూ కట్టారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని, తర్వాత ఆలయ క్షేత్ర పాలకులు శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారిని కొలిచారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా దేవస్థానానికి సుమారు రూ.39,61,221 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఆగకుండా.. ఆపకుండా

- రాత్రి నుంచి తెల్లవారే వరకూ చోరీలు
- చివరికి చిక్కిన ఓ నిందితుడు

సీతానగరం: ఎక్కడా ఆగలేదు.. ఒకేరోజు చోరీల మీద చోరీల చేసి చివరికి ఒకరు పోలీసులకు చిక్కగా, మరొకరు పరారయ్యారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. గోకవరం మండలం రంపయర్రంపాలేనికి చెందిన ప్రగడ నాగశివ ధవళేశ్వరంలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరంలో తన స్నేహితుడు గెడ్డం శివతో కలసి బైక్‌పై రఘుదేవపురం యనమదల రామాలయం వద్దకు వచ్చాడు. వారిద్దరూ అక్కడి హుండీలో నగదు దొంగిలించారు. తర్వాత చినకొండేపూడికి వెళ్లి వడ్డమూరి సీతారామరాజుకు చెందిన మోటారు సైకిల్‌ను చోరీ చేశారు. తర్వాత ఒక మోటారు సైకిల్‌ను సీతానగరంలోని ఓ ప్రాంతంలో ఉంచి కోరుకొండ వెళ్లారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఆవరణలోని హుండీలో నగదు దొంగిలించారు. అక్కడి నుంచి మళ్లీ వదిలివెళ్లిన మోటారు సైకిల్ కోసం సీతానగరం వచ్చి తిరిగి వెళ్తూ రఘుదేవపురం కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో హుండీ చోరీ చేశారు. స్థానికులు గమనించి నాగశివను పట్టుకోగా, గెడ్డం శివ బైక్‌పై పరారయ్యాడు. నాగశివ నుంచి రూ.31 వేలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. దీనిపై కోరుకొండ పోలీసులకు వివరాలు అందించగా, వారూ విచారణ జరుపుతున్నారని అన్నారు.



సీతానగరంలో పోలీసుల అదుపులో నాగశివ

హుండీల రక్షణకు చర్యలు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బయటగల హుండీలో నగదు చోరీ జరిగిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి ఆయన పరిశీలించారు. చోరీ జరిగిన విధానాన్ని సీసీ కెమెరా ద్వారా చూశారు. దేవస్థానం బయట హుండీకి ఇనుప గ్రిల్‌తో కూడిన ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్టు, దానికి గట్టి తాళాన్ని అమర్చనున్నట్టు రమేష్‌బాబు తెలిపారు. బయట హుండీ చోరీకి బాధ్యుడిని చేస్తూ దేవస్థానంలోని సెక్యూరిటీ పర్సన్‌ను తొలగించనున్నట్టు ఆయన వివరించారు. కోరుకొండ సీఐ అడపా నాగమురళి, ఎస్సై ఆనందబాబు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ సైల్ల కాలేజ్ (ఉమెన్స్) విజయవాడలో B.Sc. ఫొరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / AI & ML / మెడికల్ ఇమేజింగ్ (రేడియాలజీ); BBA - 3 సం॥ల కోర్సులు. అర్హత : ఇంటర్. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. హాస్టల్ కలదు. సంప్ర : 84658 74867, 99121 78237 [V- 2624]

SINGLE SITTING

■ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్ రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిలయిన వారికి కట్టుకునే అవకాశం. డిగ్రీ & పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, B.Li.Sc. నాగార్జున, ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీల ఎగ్జామ్స్ అన్నీ మా కాకతీయ విద్యాసంస్థలో జరుగును. 100% పాస్. అడ్మిషన్లు జరుగుచున్నవి. కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, రాజమండ్రి, ఆత్రేయపురం. ఫోన్ : 99494 82757, 98495 82043 [V-2627]

Real Estate

■ MSR Developers కొరకు తెలంగాణ/ఆంధ్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెంచర్ ల్యాండ్ పార్టనర్స్ కావలెను.ఫోన్: 8499940666 [H-189681]

FLAT FOR SALE

■ 1590 sft Flat in 4th Floor, Oxygen Towers, A.V. Apparao Road, RJY, with U/d Share 63 sqyds. For Sale Cont: 8374568999 [C-800321]

■ రాజమండ్రి ఎయిర్‌పోర్ట్‌కి దగ్గరలో బుచ్చింపేట దగ్గర Open Plots అమ్మకానికి కలవు. రుడా నార్మ్స్‌తో గజం కేవలం 6,000/- సెల్: 9059091156 [C-800308]

■ RJY, V.L.Puram 3BHK Deluxe E/F Flats for sale 1510 Sft. ready to occupy lift & car parking available contact. ✆ : 99088 71143 [R-6811]

■ 1BHK (16L) & 2BHK (36L) ఈస్ట్ ఫ్లాట్స్ అమ్మకం కొత్తగ నిర్మించే మా అపార్ట్మెంట్ లో అడ్వాన్స్ బుకింగ్ లిఫ్ట్, కార్‌పార్కింగ్ కలదు. Opp.చిల్డ్రన్స్ పార్క్, లాలాచెరువు హైవే రోడ్. ✆ : 95733 53388 [R-1609]

LAND FOR SALE

■ Hyderabad 40 KM From Appa Junction, Kanapur (Vill), Chevella (Mandal) 3.3 Acres Agriculture Land For Sale Clear Title: 9490460550 [H-189689]

5 ఎకరాల పొలం అమ్మబడును

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర గ్రామంలో ఆర్ & బి రోడ్‌ను చేర్చియున్న లేఅవుట్‌ను ఆనుకుని యున్న పొలంలోకి 5 రోడ్లు వచ్చి యున్న 5 ఎకరముల రొయ్యల చెరువులతో యున్న పొలము అమ్మబడును. లే అవుట్‌లకి అనువైనది. ఈ స్థలము కొరకు సంప్రదించండి 97052 19610

SITE FOR SALE

■ కాకినాడ డైరీ ఫారం సెంటర్ రెవిన్యూ కాలనీ దగ్గరలో మెడికల్ ఎంప్లాయిస్ కాలనీ లేఔట్ సాయిబాబా గుడివద్ద రోడ్ ఫేసింగ్‌లో ఉన్న 282 చ॥గ॥ల స్థలం అమ్మకమునకు కలదు. Cont: ఎస్. పెద్దిరెడ్డి, ✆ : 98482 31348, 93932 31348 [R-1976]

PLOT FOR SALE

■ విజయవాడ: 4,000/– గజం, రాజధానిగా అభివృద్ధి చెందుతూ, ఔటర్ రింగ్ రోడ్, 4 లైన్ల రోడ్‌కి అతి దగ్గరలో స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 93985 76997 [R-1972]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సేల్స్ మెన్స్, సూపర్‌వైజర్లు కావలెను. ఆకర్షణీయమైన జీతము. C/o. శ్రీ గాయత్రి ఏజెన్సీస్, కాకినాడ ✆ : 94403 52688 [R-41]

మార్కెటింగ్ టీమ్ కావలెను

అదితి ఇన్‌ఫ్రా డెవలపర్స్ - పెనుగుదురు (కాకినాడ) నకు స్థలములు, బిల్డింగ్‌లు మార్కెటింగ్ చేయుటకు కమీషన్ పద్ధతిన పనిచేయుటకు అనుభవజ్ఞులైన వారు కావలెను. సంప్రదించండి

నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి సెల్: 98661 31735

■ విజయవాడలో NRI ల / సంపన్నుల ఇళ్ళ వద్దే వుండి పెద్దవారిని / బెడ్ పేషెంట్లని చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F ఆయాలు, నర్సులు కావలెను. వ+భో+జీతం ✆ 91608 35559, 98850 25559 [B-133]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185247]

■ అన్‌లోడర్స్ పురుషులు కావలెను. 8గం॥ డ్యూటీ Age: 25-45 years ఆధార్‌కార్డ్ బ్యాంక్ పాస్ బుక్ కావలెను. మంచిజీతం+ ESIC+PF కలవు ✆ 9100028528, 7396128206 [G-2125]

■ ప్రముఖ విద్యాసంస్థలో ఇంటివద్దనే ఉంటూ పనిచేయుటకు మండలాలు వారీగా డిగ్రీ మరియు ఎంబీఏ చదివిన వారు కావలెను. జీతం 15K నుంచి 30 K వరకు ✆ : 90108 26826 [R-943]

■ హరేకృష్ణ హోంకేర్, విజయవాడ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొను టకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 96405 28899, 96406 48899 [H-796255]

■ కన్సల్టెన్సీ కాదుVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15000 -40000,ఫ్రీరూం+భోజనం.HYD.7993583999 [HA-354]

■ హాస్టల్‌లో వంట చేయడానికి 10 సం॥ అనుభవం గల ఫ్యామిలీ కావలెను మరియు సూపర్‌వైజర్ కావలెను & సర్వింగ్ బాయ్స్ కూడా కావలెను.రూమ్+ఫుడ్ ఫ్రీ. సంప్ర: 9949633117 [H-796242]

■ HYD లోని ప్రముఖ దేవాలయం (రామాలయం)లో పనిచేయుటకు అనుభవం గల శ్రీవైష్ణవ/బ్రాహ్మణ అర్చకులు కావలెను. మంచి జీతం + వసతి CV TO: 9985362832 [H-189693]

■ హైదరాబాద్‌లో ఇంట్లో పని చేయడానికి ఇద్దరు ఆడ పనిమనుషులు కావలెను. జీతం 10000/– భోజనం, వసతి ఇవ్వబడును. వెంటనే సంప్ర: 7702753493 [HA-16312]

■ పైడా డిగ్రీ కాలేజీ కాకినాడ యందు పని చేయుటకు Administrative Officer, Accountant, Office Assistants కావలెను. వివరాలకు ఫోన్ : 9705622666 [HA-02704]

■ శ్రీ NRKA టెక్స్‌టైల్స్ రాజమండ్రిలో పని చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. డ్యూటీ 8 గం॥ జీతం: 7500 నుండి 12000 వరకు & PF, ESI, ఉచిత వసతి, సబ్సిడీ భోజనం ఏర్పాటు సంప్ర॥ లాలాచెర్వు జంక్షన్. ✆ : 85009 91230 [R-540]

■ Wanted Female Hostel Incharges Qualification Any Degree. Age Limit: 21 to 40 years, Salary: 12000/-. Location: Master Minds College. Rajahmundry. Contact: 92487 33370 [G-5522]

■ జీతం: రూ.12,000/–లు నుండి రూ.20,000/–లు, టెక్నికల్ స్టాఫ్ కావలెను. అర్హత: I.T.I., డిప్లమో, B.Tech - మెకానికల్ / ఎలక్ట్రికల్ చేసిన అభ్యర్థులు, అనుభవం లేని వారికి ట్రైనింగ్ ఇవ్వబడును. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 81434 12349 [R-38]

WANTED DISTRIBUTORS

■ ప్రముఖ META SHOT కంపెనీ MIXED REALITY BAT కు A.P లోని అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. వివరములకు సంప్రదించండి:7032174231, 8096490964. [NA-2673]

Services

వరుడు కావలెను

■ మాల క్రిస్టియన్స్, 2nd మ్యాచ్, వయస్సు 36, 5.3 H, Fair, M.B.A, బ్యాంక్ మేనేజర్, వధువుకి వరుడు ఎంప్లాయి కావలెను. ✆ : 77949 11019 [R-1229022]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ నాలుగు లైన్లకు రూ.: 400/- అదనపు లైనుకు రూ.: 90/- GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602900, 9010120345, 9705764205 కాకినాడ - 90101 11140, 90109 67896, పిఠాపురం - 99516 02838, తుని - 90109 67896, జగ్గంపేట - 99482 85589 యానాం - 90101 11140, అమలాపురం-9705347414, 9705346456, 9848648081, 9010299082, మండపేట : సెల్ : 99516 02941, 08855-233559, రామచంద్రపురం : సెల్ : 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.